# నమస్తే తెలంగాణ
DISTRICT SUPPLEMENT

# వికారాబాద్

గురువారం 7 డిసెంబర్ 2023
THURSDAY, DECEMBER 7, 2023
VIKARABAD
పేజీలు : 8
PAGES




## అంబేద్కర్ ఆశయాలను
# ముందుకు తీసుకెళ్లాలి

*అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి*

వికారాబాద్, డిసెంబర్ 6 : అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రం రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి యువత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకొని, జీవితంలో రాణించాలన్నారు. మరోవైపు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, నాయకులు అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. వాడవాడలా ఆయన చిత్రపటాలను ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



**జోరందుకున్న పంటల సాగు పనులు**

## యాసంగి సాగులో..
# అన్నదాత బిజీబిజీ..

**యాసంగి సాగులో** అన్నదాతలు నిమగ్నమయ్యారు. దుక్కులు దున్నడం, నారుమడులు పోయడం వంటి పనులు జోరుగా సాగుతున్నాయి. ఈసారి రంగారెడ్డి జిల్లాలో మొత్తం 99,306 ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే 6,943 ఎకరాల్లో ఆయా పంటలను రైతులు సాగు చేశారు. నీరు పుష్కలంగా ఉన్న ప్రాంతాల్లో వరి పంటను సాగు చేసుకుంటుండగా.. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆరుతడి పంటలను సాగు చేసేందుకే ఆసక్తి కనబరుస్తున్నారు. కాగా, అధికశాతం రైతులు పత్తి సాగువైపే మొగ్గు చూపుతున్నారు. మరోవైపు యాసంగికి అవసరమైన విత్తనాలు, ఎరువులను వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉంచింది. గత పదేండ్లలో విత్తనాలు, ఎరువులకు ఎక్కడా కొరత లేనందున ఈ సీజన్‌లో కూడా అదే రీతిలో రైతులకు అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. యాసంగికి సంబంధించి 17,741 టన్నుల యూరియా, 6వేల టన్నుల డీఏపీ, 500 టన్నుల ఎస్ఎస్పీ, 1200 టన్నుల ఎంవోపీ, 12,500 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అవసరం కానుండగా.. ఇప్పటికే 5,588 టన్నుల మేర ఎరువులను అధికారులు రైతులకు పంపిణీ చేశారు.

-రంగారెడ్డి, డిసెంబర్ 6
(నమస్తే తెలంగాణ)

**ఈ సీజన్‌లో 99,306 ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా**

**ఇప్పటివరకు 6,943 ఎకరాల్లో పంటలు వేసిన రైతన్నలు**

**నీటి లభ్యత ఉన్న చోట పత్తి సాగు వైపు మొగ్గు**

**సరిపడా విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచిన జిల్లా వ్యవసాయ శాఖ**





# నాడు మర్రి.. నేడు అనుముల

వికారాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): 33 ఏండ్ల తర్వాత వికారాబాద్ జిల్లాకు అరుదైన గౌరవం దక్కింది. జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన అనుముల రేవంత్‌రెడ్డి నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వికారాబాద్ ప్రాంతం నుంచి రెండో వ్యక్తి సీఎం అవుతుండడం విశేషం. మొదటగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాలోని మర్పల్లి మండలం సిరిపురం గ్రామానికి చెందిన మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. వికారాబాద్, తాండూరు ద్విశాసన సభల నుంచి ఎన్నికైన మర్రి చెన్నారెడ్డి సీఎంగా పనిచేయగా, నేడు జిల్లా నుంచి ఎన్నికైన రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రి పదవి వరించింది. అయితే వికారాబాద్ నుంచి ఎన్నికైన అనంతరం 1978–80 వరకు, తాండూరు నుంచి ఎన్నికైన అనంతరం 1989–90 మధ్య మర్రి చెన్నారెడ్డి రెండు పర్యాయాలు సీఎంగా పనిచేయగా, సరిగ్గా 33 ఏండ్ల తర్వాత జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా నేడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. అయితే జిల్లా నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై సీఎం కావడంతో రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం అయిన కొడంగల్‌తోపాటు వికారాబాద్ జిల్లాకు మహర్దశ రానున్నదని జిల్లా ప్రజానీకం ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**33 ఏండ్ల తర్వాత వికారాబాద్ జిల్లాకు దక్కిన అరుదైన గౌరవం**

**ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా మర్రి చెన్నారెడ్డి**

**కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన రేవంత్ రెడ్డి నేడు సీఎంగా ప్రమాణ స్వీకారం**